క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాత జీవీ రేవంత్

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన జీవీ రేవంత్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఓ రామానుజన్‌కు దాత నగదు అందజేశారు. దాతను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

నేడు 'జగనే ఎందుకు కావాలంటే' సదస్సు

అవుకు: మండల కేంద్రం అవుకు సమీపంలోని గాయత్రీ రైస్‌మిల్‌లో శనివారం 'జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకుడు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా అమర్ నాథ్ రెడ్డి తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

అనాథ యాచకురాలి మృతి

కోవెలకుంట్ల: స్థానిక బనగానపల్లె చౌరస్తాలో శుక్రవారం ఉదయం ఓ అనాథ యాచక వృద్ధురాలు మృతి చెందింది. కొంతకాలం క్రితం ఎక్కడి నుంచో వచ్చి పట్టణంలో భిక్షాటన చేసుకుంటూ పేట స్కూల్ సమీపంలో తలదాచుకుంటోంది. అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువాత పడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించగా పారిశుద్ధ్య కార్మికులు ఖననం చేశారు.

అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యండి



ఓటు విలువను వివరిస్తున్న కురుకుందు హరి తదితరులు


డోన్ టౌన్ : రాష్ట్రంతోపాటు డోన్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి ప్రజలను కోరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 5,6 వార్డులలో ఆయన బుగ్గన మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్ కటికె వేణు, పార్టీ కన్వీనర్‌లు మేడా రఘు, వడ్డే రంగస్వామి, నాయకులు సుంకన్న, భాస్కర్, షాషా, డంకేష్,డీ లర్ కృష్ణలతో కలిసి మీ ఓటు విలువ ఒక మార్పుకు నాంది కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసనాయక్



కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా కోవెలకుంట్లకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకుడు శ్రీనివాసనాయక్‌ను నియమించారు. డోన్ రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఏర్పాటైన కమిటీలో చైర్మన్‌గా డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, ఎక్స్ అఫిసియో సభ్యులుగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కొనసాగుతున్నారు. ఈ కమిటీలో పట్టణానికి చెందిన శ్రీనివాసనాయక్‌ను సభ్యుడిగా నియమించడంతో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

శుద్ధజల కేంద్రం ప్రారంభం



శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

అవుకు: మండల పరిధిలోని గుండ్లశింగవరంలో నిర్మించిన శుద్ధజల కేంద్రాన్ని శుక్రవారం సర్పంచ్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా రూ.5లక్షలు వెచ్చించి గ్రామం నడిబొడ్డున మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు కరిముల్లా, కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపసర్పంచ్ గద్దం ఆదినారాయణ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలకు చేసిన మేలును వివరిద్దాం

- ప్రతి కుంటుబానికి సంక్షేమ పథకాలు అందాయి
- నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చేరవేయాలి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వేదికపై జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల/ సంజామల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాన ప్రాధాన్యనిస్తూ ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నా ఏదో విధంగా ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు టీడీపీ నాయకులు ఎల్లోమీడియాను అడ్డుపెట్టుకుని కుట్రలు పన్నుతున్నారని, దిగజారుడు రాతలను తిప్పుకొట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రం కొలిమిగుండ్ల షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఏపీకీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా సంజామలలో ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోనూ నిర్వహించిన ఏపీకీ జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాష్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లాల ప్రచార రీజనల్ కో-ఆర్డినేటర్ పోచా శీలా రెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, మండల ఉపాధ్యక్షులు చిన్న బాబు,కోవెలకుంట్ల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగార్జున రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రాంమ్మోహన్ రెడ్డి తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఉద్దేశించి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రసంగించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేశానని గొప్పలు చెప్పడం తప్పా ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. టీడీపీ పాలనలో జరిగిన అక్రమాలను, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రతికుటుంబానికి ప్రభుత్వ నుంచి లబ్ధి చేకూరిందని, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు జరిగిన మేలు, అభివృద్ధిని ప్రజలకు బాధ్యతగా వివరించాలని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులకు సూచించారు. బనగానపల్లె నియోజకవర్గంలో దాదాపు 90 శాతం ప్రతి కుటుంబానికి దాదాపు రూ. 2 నుంచి రూ. 5 లక్షలు వరుకు ప్రభుత్వం నుంచి సాయం అదిందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టామని, ఇప్పటికీ అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును, జరిగిన అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించగలిగితే, 2024లో 175 నియోజకవర్గాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తాం అని, మరోమారు జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంజామల మండలం సర్పంచ్‌లు సోమసుందర్ రెడ్డి, అసద్ అల్లిఖాన్, శివ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోచా వెంకట రామిరెడ్డి, ఎస్‌సీ బాబు, గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, నరసిహారెడ్డి, బత్తుల రామ చంద్ర రెడ్డి, దేశాయ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దారెడ్డి సుధాకర్ రెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూమి ఇచ్చితీరుతాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల మండలంలో పలు గ్రామాల్లో 8వేల ఎకరాలను ఎన్ని అడ్డంకులు వచ్చినా అధిగమించి ప్రజలకు వంద శాతం అసైన్‌మెంట్ భూములు ఇచ్చి తీరుతామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఘంటా పథంగా చెప్పారు. పేదలకు మంచి చేస్తుంటే మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్థనరెడ్డికి నచ్చదని విమర్శించారు. ఏ కార్యక్రమం తలపెట్టినా కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం బీసీ నైజం అని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు బీసీకి పేదలకు భూ పంపిణీ చేయాలనే ఆలోచన ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.వంద కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు. మారుమూల గ్రామాలు అభివృద్ధిలోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. స్కిల్‌డెవలప్ మెంట్ స్కాంలో సాక్ష్యాధారాలతో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయినా టీడీపీ నాయకులు మాత్రం రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏది ఏమైనా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి,వైఎస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజా రెడ్డి,జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి,హనుమంతుగుండం సొసైటీ అధ్యక్షుడు మూల ఈశ్వరరెడ్డి,నాయకులు పేరం నందకిషోర్‌రెడ్డి,ఉలవల నరసింహుడు,సత్తిగారి రామిరెడ్డి, శేఖర్‌రెడ్డి,తోట మల్లేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జగన్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు,సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు,వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్ద వెంతుర్లలో మెడికల్ క్యాంపు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్లలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులు వివిధ రకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. మెడికల్ క్యాంపును సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెద్ద కొట్టాలలో..

అవుకు: మండలంలోని గుండ్లశింగవరం గ్రామసచివాలయ పరిధిలోని పెద్ద కొట్టాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇద్దరు జనరల్ డాక్టర్లు, ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రజా రవాణా సమస్యలపై శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. డిపో పరిధిలోని ఆయా రూట్లలో నడిపే బస్సు సర్వీసులు, ఏవైనా సమస్యలు, సూచనలు, సలహాలను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. 9959225798 నంబర్‌కు ఫోన్‌చేసి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చోరీ కేసులో దొంగ అరెస్ట్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం శింగవరంలో చోరీ కేసులో దొంగను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. బెలుం శింగవరానికి చెందిన ఓబులేసు ఇంట్లో ఈనెల 1వ తేదీన చోరీ జరిగిందన్నారు. నాలుగు తులాల బంగారం అభరణాలు, రూ.15వేలు అపహరణకు గురయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన శేఖర్‌ను అదుపులోకి తీసుకొని, బంగారం అభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం 11కేవీ హైవే ఫీడర్ కింద లైన్ వర్క్ జరుగుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, కంబాలపాడు హైవే సర్కిల్ ప్రాంతం,శ్రీ నివాసనగర్, టీచర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

రైల్వే గెట్ల సమీపంలో నవ జాత శిశువు

డోన్ టౌన్ : పట్టణంలోని నంద్యాల రైల్వే గేట్ల సమీపంలోని పూల మార్కెట్ వెనుక ఒక గోనె సంచిలో శుక్రవారం నవజాత ఆడ శిశువు ఉండటంతో పట్టణంలో దావనంలా వ్యాపించింది. రైల్వే డబ్లింగ్ పనులు చేస్తున్న జేసీబీ డ్రైవర్ విషయాన్ని స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లుకు చేరవేశారు. ఆయన పట్టణ పోలీసులకు తెలిపారు. అంతలోనే విషయం తెలుసుకొన్న ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుగుణమ్మ, సూపర్ వైజర్లు పరమేశ్వరి, టీచర్లు శ్రీదేవి,లక్ష్మీ అక్కడికి చేరుకున్నారు. నవ జాత శిశును పరిశీలించగా రెండు రోజుల క్రితం జన్మించిన ఆడ శిశువు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం పట్టణ సీఐ ప్రవీణకుమార్, ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి అక్కడి చేరుకుని పరిసరాలను పరిశీలించి డోన్‌ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాలలోనే పునాదులు

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల స్థాయి నుంచే పునాదులు వేస్తున్నాయని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను శుక్రవారం ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అత్యున్నత స్థానాలను అధిరోహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ఎన్నో పథకాను ప్రవేశపెట్టి క్రింది స్థాయి నుంచే ప్రోత్సహిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యను సులభతరం చేసేందుకు ఉచితంగా ట్యాబ్‌లను అందించటం, అలాగే తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయటమే కాకుండా ఆర్థిక ఇబ్బందులు రాకుండా అమ్మ ఒడి పథకం, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక కిట్లు, వసతి దీవెన లాంటి ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించి ప్రశంసించారు. ప్రిన్సిపల్ నాగసుబ్బరాయుడు, ఉపాధ్యాయులు సాంబశివ, బషీర్ అహ్మద్, మునేంద్ర, ముఖేష్, మునిచంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్తం

కొత్తకోటలో వ్యవసాయ సలహ మండలి సమావేశం

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహ మండలి సమావేశం జరిగింది. అధ్యక్షుడు చంద్రన్నయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏఓ అబ్దుల్‌షఫీ మాట్లాడారు. ప్రతిరైతు సాగు చేసిన పంటలను ఈ క్రాఫ్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం జొన్నలను 80శాతం సబ్సిడీతో ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రూ.3.70 కోట్లతో కందకాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం

బేతంచెర్ల: కందకాన్ని రూ.3.70 కోట్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. పట్టణంలోని కోటపేట, డ్రైవర్స్ కాలనీ సమీపాన ఉన్న కందకంలో అభివృద్ధి పనులు శర వేగంగా సాగుతున్నాయి. కందకం డ్రైనేజీ కాల్వ పనులను నగర పంచాయతీ చైర్మన్‌తోపాటు మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం మూడవ గ్రామ సచివాలయంలో కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకునేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు.

స్పోర్ట్స్ కిట్స్, యూనిఫాం పంపిణీ

బనగానపల్లెరూరల్ : మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌డీఆర్ విద్యా సంస్థల చైర్మన్ శనివారపు కొండారెడ్డి తన తమ్ముడు చైతన్యరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రూ.50 వేల స్పోర్ట్స్ కిట్లతో పాటు యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులకు చేయూతనిస్తున్న కొండారెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీయువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వరెడ్డి అభినందించారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు తమ ఎస్‌డీఆర్ కళాశాలలో ఇంటర్ విద్యను ఉచితంగా అందజేస్తామని ఈ సందర్భంగా కొండారెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, గ్రామ పెద్దలు గుండం నాగార్జునరెడ్డి, గుండం సురేంద్రారెడ్డి, జీఎస్‌ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

బనగానపల్లెరూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలొని ఎర్రగుడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామసుబ్బారెడ్డిని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. రామసుబ్బారెడ్డి దంపతులు ఉదయం నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి దర్శనం బైక్ వెళ్లారు. దర్శనం అనంతరం బనగానపల్లె పట్టణానికి వస్తుండగా పండ్లాపురం గ్రామ సమీపంలో బైక్ స్కిడ్ అయి దంపతులు ఇద్దరు స్వల్ప గాయాలయ్యాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, మాదవరెడ్డి పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లెరూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని పలుకూరుకు చెందిన కె.ఆదిలక్ష్మీ తన భర్త వెంకటేశ్వర్లు వేధిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు ఆదిలక్ష్మీకి ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరుకు చెందిన వెంకటరమణతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. ఇతను హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. అయితే కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తూ కాపురానికి తీసుకెళ్లడంలేదని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్యాపిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అమలైన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐసీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వలంటీర్లు, గృహసారథులతో 'ఏపీకి జగనే సీఎం ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధి గురించి వివరించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు నేరేడుచెర్ల వెంకటేశ్, సోమశేఖర్, ఇమాముద్దీన్, చంద్రశేఖర్ రెడ్డి, కొండయ్య, బషీర్, జక్కసానికుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



యంబాయి గ్రామంలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్

డోన్ రూరల్ : ప్రజల ఆరోగ్య సంరక్షణే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొచ్చెర్వు గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు రాంభూపాల్, శ్రీకాంత్, నిఖిల్ ప్రజలకు బీపీ, షుగర్, గుండే, కీళ్ల నొప్పులు, కంటి తదితర ఆరోగ్య పరీక్షలు చేశారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు, రేగటి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. దీంతో మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, చింతలపేట సర్పంచ్ సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, పేరన్న, క్రిష్టారెడ్డి, బీరప్ప, నాగేశ్వరరావు, పాపన్న, గంగాధర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

బేతంచెర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్యం అందుతుందని వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ కమిటీ సభ్యులు ముర్తుజావలి, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. వైద్యులు ప్రజలకు బీపీ, షుగర్, రక్త, గల్ల, కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరికొందరికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు ఎద్దులన్న, మాజీ ఎంపీటీసీ మౌలాలీ, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ధ్యేయం

ప్యాపిలి: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. మండల పరిధిలోని కలచట్లలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మందులతో నయం కాని జబ్బులతో బాధ పడుతున్న రోగులను గుర్తించి డోన్, కర్నూలు ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు నితీశ్, నుస్రత్ ఉ జొహరా, జయలక్ష్మి, కళ్యాణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మందులు ఇచ్చారు



కొన్ని రోజుల నుంచి కళ్లు మసకబారాయి. కళ్లలో మంట, నొప్పితో బాధ పడుతున్నా. వైద్యులు ఇంటి వద్దకు వచ్చి నా సమస్య తెలుసుకుని వెళ్లారు. ఈ రోజు వైద్య శిబిరం వద్దకు రావాలని చెపితే వచ్చాను. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక నొప్పిని అలాగే భరిస్తున్న నాకు వైద్యులు వచ్చి ధైర్యం చెప్పారు. మందులు వాడితే నొప్పి తగ్గుతుందన్నారు.

– తిమ్మలమ్మ, కలచట్ల

వైద్య సేవలు బాగున్నాయి...



మొకాళ్ల నొప్పులు చూపించుకున్నా. వైద్య శిబిరంలో ఉన్న డాక్టర్లు ఓపిగ్గా పరీక్షలు చేశారు. అదేవిధంగా ఉచితంగా మందులను ఇచ్చారు. బీపీ,షుగర్ పరీక్షలు కూడ ఉచితంగా చేశారు. ఒక్క రూపాయి ఖర్చులేకుండా మా గ్రామంలోనే అన్ని పరీక్షలు చేయడం పేదలకు ఎంతో మేలు. ఇలాంటి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గ్రామాల్లో తరుచూ నిర్వహిస్తే బాగుంటుంది.

– వడ్డె లక్ష్మీదేవి, పేషెంట్, నందవరం

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బం,



మహిళకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



మెట్టుపల్లెలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరావు, మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మూడవ గ్రామసచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయా కాలనీలకుచెందిన 572 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాయలూరు, రేవనూరు పీహెచ్‌సీల డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, మేఘన, రాబర్ట్ కెన్నెడీ, అశోక్, విద్యాసాగర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 267 మంది మహిళలు, 242 మంది పురుషులు, 49 మంది చిన్న పిల్లలు, 22 మంది గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తోందన్నారు. వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఆధునిక వైద్యసేవలందిస్తోందన్నారు. అనంతరం ఆకుకూరలు, కూరగాయలు, పోషకాలతో కూడిన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యదున్నీసా, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరినీ ఆరోగ్యంగా ఉంచడమే లక్ష్యం

బనగానపల్లె: ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతంగా ఉంచేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేశారని తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శివరామయ్య పేర్కొన్నారు. మండలంలోని నందవరం గ్రామ సచివాలయం-2లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఖైరూన్‌బీ, గ్రామ పెద్దలు తులసిశ్వరరెడ్డి ప్రారంభించారు. వైద్యులు శ్రీలక్ష్మీ, బి.లక్ష్మీ, మహమ్మద్, సోహెల్‌బాబు, ఫిరోజ్ తదితరులు 605 మందికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, గుండె పరీక్షలతోపాటు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు, సరళగంగ, ఇన్‌చార్జీ ఈఓఆర్‌డీ గురుప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, ఖలీల్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

289 మందికి వైద్య పరీక్షలు

అవుకు: మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో డాక్టర్లు 289 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు నవీన్, సుప్రవల్లిక, డెర్మటాలజీ జనార్దన్, జనరల్ సర్జన్ రాజేష్ ప్రజలకు బీపీ, షుగర్, గుండె, మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులకు పరీక్షలు చేసి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అదేవిధంగా 77 మందికి కంటి పరీక్షలను నిర్వహించిన వైద్యులు సర్జరీలు అవసరమైన 20 మంది రోగులను ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. అనంతరం 15 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేకల వెంకటేశ్వరరెడ్డి, రామవరం సర్పంచ్ మూరబోయిన మనోహర్, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.